నమస్తే తెలంగాణ

సంగారెడ్డి

I హైదరాబాద్, శుక్రవారం 27 డిసెంబర్ 2024 SANGAREDDY

# బాధితులకు అండగా బీఆర్ఎస్

- సీఎం రూ.2 కోట్ల పరిహారం ఇవ్వాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి

కొల్చారం, డిసెంబర్ 26: మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్‌లో సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని తొలిగిస్తూ గురువారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన అక్కెం నవీన్, పసుల ప్రసాద్ కుటుంబాలను గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రైతులు గ్రామాలకు వెళ్లే దారిలో విద్యుత్ వైర్లకు దగ్గరగా ప్రమాదకరంగా ఫ్లెక్సీలు పెట్టడంతోనే యువకులు మరణించారని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ అన్నివిధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. సంధ్య థియేటర్ ఘటనలో బాధితుడికి రూ.2 కోట్ల పరిహారం చెల్లించినట్లు కిష్టాపూర్ ఘటన బాధితులకు సైతం పరిహారం ఇవ్వాలని సీఎంను వారు డిమాండ్ చేశారు. వారి వెంట బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రాగౌడ్, మన్సూర్, ముత్యంగారి సంతోశ్, కాశీనాథ్, నయిమొద్దీన్ తదితరులు ఉన్నారు.



దేవేందర్‌రెడ్డి దంపతులను సన్మానించి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# రుణమాఫీ ఉట్టిమాటే !

- సగం రైతులకు వర్తించని పంట రుణమాఫీ
- నాలుగో విడత రూ.110 కోట్ల కోసం ఎదురుచూపులు
- ఎదురుచూస్తున్న 11,301 మంది రైతులు
- నిత్యం బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- స్పష్టత ఇవ్వని బ్యాంకర్లు, వ్యవసాయశాఖ అధికారులు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతల ఆగ్రహం

## సంగారెడ్డి జిల్లాలో రైతుల ఖాతాల్లో జమకాని డబ్బులు



సంగారెడ్డి, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ): పంట రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుకథలు చెబుతున్నదని రైతులు మండిపడుతున్నారు. వందశాతం రుణమాఫీ చేశామని రేవంత్‌రెడ్డి సర్కార్ గొప్పలు చెబుతున్నప్పటికీ సంగారెడ్డి జిల్లాలో పూర్తిగా రుణమాఫీ అమలు కాలేదు. దీంతో ప్రభుత్వ తీరుపై రైతులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ ప్రకటించినప్పటికీ ఇంకా డబ్బులు రైతుల ఖాతాల్లో జమకాలేదు. నవంబర్ 29న కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగో విడత రుణమాఫీ ప్రకటించింది. సంగారెడ్డి జిల్లాలో నాలుగో విడతలో 11,301 మంది రైతులకు రూ.110 కోట్ల రుణమాఫీ అయినట్లు ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీ ప్రకటించి నెలరోజులు సమీపిస్తున్నా ఇంకా రైతుల ఖాతాల్లో డబ్బులు చేరలేదు. రైతులు నిత్యం వ్యవసాయశాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఖాతాల్లో డబ్బులు జమకాలేదని బ్యాంకర్లు రైతులను తిప్పి పంపుతున్నారు. వ్యవసాయశాఖ అధికారులు సైతం తమ వద్దకు వచ్చిన రైతులను రుణమాఫీ డబ్బులకు సంబంధించిన సమాచారం, రుణమాఫీ అయిన రైతుల జాబితా తమ వద్దలేదంటూ సమాధానం చెబుతున్నారు. దీంతో తమకు రుణమాఫీ అమలైంది లేనిదీ తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే రైతులతో కలిసి ఆందోళన చేస్తామని మాజీమంత్రి హరీశ్‌రావు ఇటీవల సంగారెడ్డి జిల్లా పర్యటనలో ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

**రుణమాఫీపై మొదటి నుంచి తకరారు...**

సంగారెడ్డి జిల్లాలో రుణమాఫీ అమలుపై మొదటి నుంచి రైతులు అసంతృప్తితో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణం మాఫీ చేస్తామని ప్రకటించింది. ఏకకాలంలో కాకుండా నాలుగు విడతలుగా రుణమాఫీ అమలు చేసింది. అంతేకాకుండా వందశాతం అమలులో విఫలమైందని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్రప్రభుత్వ పథకం 'పీఎం కిసాన్ సమ్మాన్' మార్గదర్శకాలను రుణమాఫీలో అమలు చేయడం, రుణమాఫీకి రేషన్‌కార్డుకు లింకుపెట్టడం, కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ తదితర నిబంధనల కారణంగా సంగారెడ్డి జిల్లాలో సగంమంది రైతులకు రుణమాఫీ వర్తించలేదని రైతులు, రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. సంగారెడ్డి జిల్లాలో రూ.2 లక్షలలోపు రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య సుమారు 1.50 లక్షల నుంచి 2 లక్షలపైన ఉంటారని అంచనా. కానీ, ప్రభుత్వం ఇప్పటివరకు నాలుగు విడతల్లో కేవలం 1,08,867 మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తింపజేసింది. ఇంకా రుణమాఫీ వందశాతం అమలు కానప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం వందశాతం చేశామని చెప్పుకోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో మొదటి విడతలో 50,538 మంది రైతులకు రూ.277.73 కోట్లు, రెండో విడతలో 27,233 మంది రైతులకు రూ.286.93కోట్లు, మూడో విడతలో 19795 మంది రైతులకు రూ.277.74 కోట్ల రుణాలు మాఫీ చేసింది. మొదటి విడతలోనే రైతులు రుణమాఫీ జాబితాలో తమపేర్లు లేకపోవడంపై ఆందోళనకు దిగారు. రెండు, మూడో విడతలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మరీ ముఖ్యంగా మూడో విడత రుణమాఫీలో జిల్లాలో చాలామందికి రుణమాఫీ వర్తించలేదు. పట్టాదారు పాసుపుస్తకంలో రైతుపేరు సరిగ్గా లేకపోవడం, ఆధార్‌నెంబర్ తప్పుగా ఉండడం, ఒకే ఆధార్‌కార్డుపై ఇద్దరి పేర్లు ఉండడం, రేషన్‌కార్డు లేకపోవడం, రుణాలు రెన్యువల్ చేసుకున్న రైతుల పేర్లు లేకపోవడం తదితర కారణాలతో సంగారెడ్డి జిల్లాలో మూడో విడతలో చాలామంది రైతులకు రూ.2 లక్షల్లోపు పంటరుణమాఫీ కాలేదు. దీంతో ప్రభుత్వం ప్రత్యేకంగా వ్యవసాయశాఖ ద్వారా గ్రామాల్లో సర్వే నిర్వహించింది. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి రుణమాఫీ కానీ రైతుల వివరాలు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు,ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను తీసుకున్నారు. ఏఈవోలు రుణమాఫీ కాని రైతుల ఫొటోలను తీసుకుని ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వివరాలు అందిన తర్వాత ప్రభుత్వం నవంబర్ 29న నాలుగో విడత రుణమాఫీ ప్రకటించింది. ప్రభుత్వం నాలుగో విడతలో సంగారెడ్డి జిల్లాలో 11,301 మంది రైతులకు రూ.110,39,40,083 రుణమాఫీ చేసినట్లు ప్రకటించింది. ప్రకటించి నెల సమీపిస్తున్నా ఇంకా రైతుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదు. దీనికి తోడు నాలుగో విడతలో రుణమాఫీ వర్తింపజేసిన రైతుల వివరాలను వ్యవసాయశాఖ అధికారులు ఇంకా వెల్లడించలేదు. దీంతో రుణమాఫీ అమలుపై అయోమయం నెలకొంది. రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలుకాని బ్యాంకులు, వ్యవసాయశాఖ అధికారులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. రుణమాఫీ అయ్యింది లేనిది చెప్పాలని బ్యాంకర్లను ప్రశ్నించగా, నాలుగో విడత ఇంకా జమ చేయలేదని చెబుతుండడంతో ఏమి చేయాలో దిక్కుతోచక రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వెంటనే పంట రుణమాఫీ చేయాలని కోరుతున్నారు.

# ప్రజాసేవకే జీవితం అంకితం

- లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ ఉమ్మన్నగారి దేవేందర్‌రెడ్డి
- ఘనంగా పుట్టినరోజు వేడుకలు
- హాజరైన ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి
- పార్టీలకతీతంగా శుభాకాంక్షల వెల్లువ

కౌడిపల్లి, డిసెంబర్ 26: తన రాజకీయ జీవితం ప్రజాసేవకే అంకితమని, రాష్ట్ర అసంఘటిత కార్మిక బోర్డు మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నర్సాపూర్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఉమ్మన్నగారి దేవేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తునికి నల్ల పోచమ్మ దేవస్థానం దగ్గర నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఉమ్మన్నగారి దేవేందర్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. వేడుకలకు నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హాజరై కేక్ కట్‌చేసి దేవేందర్‌రెడ్డికి తినిపించారు. దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేవేందర్‌రెడ్డి క్రమశిక్షణ గల నాయకుడని, పార్టీ కోసం అహర్నిశలు పని చేసిన వ్యక్తి అని అన్నారు. ఇప్పటితరం నాయకులు దేవేందర్‌రెడ్డి ద్వారా ఎంతో నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..తనను ఆదరించి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న వారితోపాటు వివిధ మాధ్యమాల ద్వారా తనకు శుభాకాంక్షలు తెలిపిన అభిమానులకు, బీఆర్ఎస్ కార్యకర్తలకు దేవేందర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, మఠం భిక్షపతి, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.



దేవేందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

# ప్రాణాలు తీసిన ఫ్లెక్సీ



కొల్చారం మండలం కిష్టాపూర్ వద్ద 11 కేవీ విద్యుత్ వైర్‌కు తాకుతున్న ఇనుప పైపుతో నిర్మించిన ఫ్లెక్సీ

- ఫ్లెక్సీలు తొలిగిస్తూ కరెంట్ షాక్‌తో ఇద్దరు మృతి
- మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్‌లో ఘటన






నవీన్, ప్రసాద్ (ఫైల్)

కొల్చారం, డిసెంబర్ 26: ఫ్లెక్సీ తొలిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఇద్దరు యువకులు మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా కొల్చారం మండలం కిష్టాపూర్‌లో గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. గ్రామస్తులు, మృతుల కుటుంబీకుల కథనం ప్రకారం.. బుధవారం సీఎం రేవంత్ ఏడుపాయల దర్శనానికి వస్తున్నారని కొల్చారం మండలంలోని పోతంశెట్టిపల్లి నుంచి మెదక్ వరకు జాతీయ రహదారిపై భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కిష్టాపూర్ బస్టాండ్ సమీపంలో 11కేవీ విద్యుత్ వైర్లకు అతి సమీపంలో సైతం ఓ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. సీఎం పర్యటన అనంతరం కాంట్రాక్టర్ ఫ్లెక్సీలను తొలిగిస్తూ కిష్టాపూర్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీని వదిలి వేశారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన అక్కెం యాదగిరి, భాగ్య దంపతుల కుమారుడు నవీన్(21), అదే గ్రామానికి చెందిన పసుల వెంకటేశం, సుజాత దంపతుల కుమారుడు ప్రసాద్(20) ఇద్దరు బుధవారం రాత్రి 10:40 ప్రాంతంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న తమ వ్యవసాయ పొలంలో నారుమడిలోకి అడవి పందులు రాకుండా నిప్పు వెలిగించి వస్తామని వెళ్లారు. నారుమడి వద్ద నిప్పు వెలిగించి తిరిగి వస్తూ రోడ్డుపై ఉన్న భారీ ఫ్లెక్సీని చూసి తొలిగించే ప్రయత్నం చేశారు. ఫ్లెక్సీకి సపోర్ట్‌గా ఉన్న తాళ్లు తొలిగించడంతో అదుపు తప్పి పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లపై పడింది. ఫ్లెక్సీ ఇనుప పైపులతో నిర్మించి ఉండటంతో కరెంట్ షాక్ తగిలి ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. అటుగా వెళ్తున్న బాటసారి విద్యుత్ లైన్‌మెన్‌కు సమాచారం ఇవ్వడంతో కరెంట్ ఆఫ్ చేసి మృతదేహాలను పక్కకు తీశారు. మృతుల తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు కొల్చారం ఎస్సై గౌస్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా దవాఖానకు తరలించారు.

**దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే**

కిష్టాపూర్‌లో విద్యుత్ షాక్‌తో అక్కెం నవీన్, పసుల ప్రసాద్ మృతిచెందిన విషయం తెలుసుకున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మా రెడ్డి నాయకులతో కలిసి గురువారం కిష్టాపూర్ గ్రామాన్ని సందర్శించారు.బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



ప్రమాదం జరిగిన చోటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

# ప్రభుత్వానిదే బాధ్యత

- రూ.2 కోట్ల చొప్పన పరిహారం అందించాలి
- బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి



మెదక్, డిసెంబర్ 26(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా విద్యుత్ వైర్ల కింద కట్టిన ఫ్లెక్సీలను తొలిగిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో మృతిచెందిన నవీన్, ప్రసాద్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి గురువారం డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2 కోట్ల చొప్పున నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లించాలని ఆమె కోరారు. ఇద్దరు యువకులు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడం చాలా బాధాకరమని, ఎలాంటి ప్రోగ్రాం జరిగినా కరెంట్ వైర్ల కింద ఫ్లెక్సీలు కట్టడం ప్రమాదకరం అని ఆమె పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు దురదృష్టకరమని, దీనికి పూర్తి బాధ్యత కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. సీఎం వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఐఐటీహెచ్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

**హమామత్సు(జపాన్) నగర మేయర్ యూసుకే నకానో**



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

కంది, డిసెంబర్ 26: నూతన ఆవిష్కరణలు, టెక్నాలజీలో ఐఐటీ హైదరాబాద్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని జపాన్‌కు చెందిన హమామత్సు సిటీ మేయర్ యూసుకే నకానో అన్నారు. గురువారం జపాన్ కమిటీ బృందం ఐఐటీహెచ్‌ను సందర్శించింది. సైన్స్, ఇంజినీరింగ్ డొమైన్‌లలో భారతీయ సాంకేతిక ప్రతిభతో సహా జపాన్-భారత్ మధ్య మానవ వనరులు, ఆర్థిక మార్పిడి పెంపొందించేందుకు ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తితో జపాన్ కమిటీ సభ్యులు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఫోకస్ ఏరియాక్స్‌లో మానవ వనరుల మార్పిడి, జపాన్ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలు (సుజుకితో సహా) ఐఐటీహెచ్‌తో సంబంధాలను బలోపేతం చేసేందుకు అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా యూసుకే నకానో మాట్లాడుతూ..ఐఐటీహెచ్‌తో అధికారికంగా ఒప్పందం చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇరువురి భాగస్వామ్యం ఇరుదేశాల సంబంధాలను బలోపేతం చేస్తుందన్నారు. జపాన్ సంస్కృతి, సాంకేతికతను పరిచయం చేసేందుకు ఈ వేదిక ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. కంపెనీలను ఒకచోట చేర్చడం, పరిశోధకులు, మానవ వనరులను ఇరువురి మధ్య మార్పిడి చేసుకునేందుకు ఒప్పందం దోహదపడుతుందని తెలిపారు.

**నూతన ఆవిష్కరణలకు దోహదం..**

ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ.. ఐఐటీహెచ్-జపాన్ మధ్య సహకార ఒప్పందం చాలా సంతోషకరమని, ఇది ఐఐటీహెచ్ మౌలిక సదుపాయాల కల్పనకు గణనీయంగా దోహదం చేస్తుందని తెలిపారు. జికా ఫ్రెండ్‌షిప్ ద్వారా జపాన్, ఐఐటీహెచ్ మధ్య స్నేహం ఏర్పడిందని, సుజికితో సహా జపాన్ విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో సంబంధాలను బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతామన్నారు. ఆవిష్కరణలు, పరిశోధనలు, ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో హమత్సు సిటీ కౌన్సిల్ చైర్మన్ టోరి నోరిటాకా,ప్రతినిధులు, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

# ఐదు రోజులుగా నిలిచిన విద్యుత్

**సబ్ స్టేషన్‌ను ముట్టడించిన రైతులు**



మెదక్ జిల్లా రేగోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

రేగోడ్, డిసెంబర్ 26: మెదక్ జిల్లా రేగోడ్ మండలం మర్పల్లి గ్రామానికి ఐదురోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయకపోవడంతో ప్రజలు సాగు, తాగు నీటికి ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ సిబ్బంది తీరును నిరసిస్తూ గురువారం రేగోడ్ విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రైతులు ఆందోళన చేశారు. ఆర్టిజన్ కిషన్‌నాయక్‌కు ఐదు రోజులుగా ఎన్నిసార్లు విన్నవించినా స్పందించడం లేదని రైతులు ఆరోపించారు. పైసలిస్తేనే పనిచేస్తానని ఆయన డిమాండ్ చేస్తున్నారని రైతులు మీడియాకు తెలిపారు. ఏఎస్సై మల్లయ్య వచ్చి ఎంత నచ్చచెప్పినా రైతులు సబ్‌స్టేషన్ బిల్డింగ్ పైనుంచి కిందకు దిగలేదు. విద్యుత్ సరఫరా చేస్తేనే దిగివస్తామని మొండికేశారు. ఏఎస్సై వెంటనే ఏఈకి సమాచారం ఇవ్వడంతో ఆయన అక్కడికి చేరుకున్నారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో శాంతించారు. అనంతరం మర్పల్లి గ్రామస్తులు, వట్‌పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ భద్రారెడ్డితో కలిసి ఏఈకి వినతిపత్రం అందజేశారు.

# పెరిగిన హత్యలు..చోరీలు



మెదక్ పోలీస్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- పెరిగిన రోడ్డు ప్రమాదాలు..తగ్గిన మృతులు
- దొంగతనాల కేసుల్లో గతేడాది 35శాతం.. ఈసారి 36.42 శాతం రికవరీ
- జిల్లాలో గతేడాది 4187 కేసులు .. 2024లో 4871 కేసులు
- మహిళలపై జరిగిన నేరాల్లో 355 కేసులు నమోదు
- 71 భరోసా కేసుల్లో 86 మంది అరెస్ట్
- జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులు 48 నమోదు
- సైబర్ క్రైం కేసులు 147...డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 6563 కేసులు
- 2024 మెదక్ జిల్లా పోలీసు వార్షిక నివేదిక విడుదల చేసిన ఎస్పీ

మెదక్, డిసెంబర్ 26 (నమస్తే తెలంగాణ):మెదక్ జిల్లాలో 2023-24 సంవత్సరంలో 4871 కేసులు నమోదయ్యాయని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు వార్షిక నివేదిక-2024ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 2023లో 4187 కేసులు నమోదు కాగా, 2024లో 4871 కేసులు నమోదైనట్లు తెలిపారు. హత్యలు, లైంగికదాడులు కేసుల్లో హత్యలు 2023లో 26 కాగా, 2024లో 28 కేసులు నమోదైపట్లు చెప్పారు. ఆస్తి హత్యలు 2023లో 7 కాగా, 2024లో 13 నమోదు కాగా, అపహరణ కేసులు 2023లో 31 కాగా, 2024లో 41 కేసులు నమోదయ్యాయి. దొంగతనాల కేసులు14, పగటి దొంగతనాలు 29, రాత్రి దొంగతనాలు 188, గొలుసు దొంగతనాలు 7, దొంగతనాలు 249, ఆలయాల దొంగతనాలు 26, ఆటోమొబైల్ దొంగతనాలు 179 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. మహిళలపై 2023లో 331 కేసులు నమోదు కాగా, 2024లో 355 కేసులు నమోదైనట్లు తెలిపారు. షీటీమ్‌లు 2024లో 48 కేసులకు కౌన్సెలింగ్ ఇవ్వగా, 27 కేసులు నమోదైనట్లు తెలిపారు. జనవరి 2024 నుంచి 31 నవంబర్ వరకు 71 భరోసా(పోక్సో) కేసులు నమోదు కాగా, 86 మందిని అరెస్ట్ చేశామని, రూ.22 లక్షల నష్టపరిహారం ఇప్పించినట్లు ఎస్పీ తెలిపారు. దొంగతనాల కేసుల్లో గతేడాది 35 శాతం రికవరీ చేస్తే, ఈసారి 36.42 శాతం రికవరీ చేశామని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు.

**ఈ ఏడాది పెరిగిన ఎస్సీ, ఎస్టీ కేసులు....**

మెదక్ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసులు గతేడాది కంటే పెరిగాయని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. 2023లో 31 ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు కాగా, 2024లో 48 కేసులు నమోదైనట్లు తెలిపారు. సైబర్ క్రైం కేసులు 2023లో 92 కేసులు నమోదు కాగా, 2024లో 147 కేసులు నమోదైనట్లు తెలిపారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 2023లో 562 ప్రమాదాలు జరగగా, 323 మంది మృతి చెందారని, 480 మంది క్షతగాత్రులు అయ్యారన్నారు. 2024లో 568 ప్రమాదాలు జరిగితే 302 మంది మృతి చెందారని, 459 మంది క్షతగాత్రులు అయినట్లు తెలిపారు. 2023లో వాహన తనిఖీల్లో 2,88,456 కేసులు నమోదు కాగా, 2024లో 2,72,060 కేసులు నమోదైనట్లు వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో గతేడాది 4740 కేసులు నమోదై 10 మందికి జైలు శిక్ష పడిందని, ఈసారి 6563 కేసులు నమోదు కాగా, 11 మందికి జైలు శిక్ష పడిందని ఎస్పీ వెల్లడించారు. మెదక్ జిల్లాలో గతేడాది పేకాట కేసులు 39 నమోదు కాగా, రూ.19,18,270 నగదును సీజ్ చేశామన్నారు. ఈసారి 38 కేసుల్లో రూ.9,70,082 నగదు సీజ్ చేశామని చెప్పారు. మిస్సింగ్ కేసులు గతేడాది 369 కేసులు నమోదు కాగా, ఈసారి 397 కేసులు నమోదైనట్లు తెలిపారు. గతేడాది 344 మందిని గుర్తించగా, ఈ సంవత్సరం 362 మందిని గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు.

**సైబర్ క్రైంపై ప్రత్యేక దృష్టి**

2025లో సైబర్ క్రైమ్స్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్త వ్యక్తులు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయవద్దని, ఓటీపీ చెప్పకూడదని సూచించారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్లు మధ్య తరగతి కుటుంబాలనే టార్గెట్ చేసి సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. లోన్లు, ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలుకుతున్నారని, వాటికి ఆకర్షితులై యువకులు, ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడుతున్నారని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

# ముమ్మరంగా యాసంగి పనులు



నారాయణరావుపేట మండలం జక్కాపూర్ గ్రామంలో వరి మొలక చల్లుతున్న రైతు



గుర్రాలగొంది గ్రామంలో పనిముట్లు తీసుకువెళ్తున్న రైతులు

సిద్దిపేట జిల్లాలో యాసంగి సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఇవ్వకపోవడంతో రైతులు అప్పులు తెచ్చి వ్యవసాయ పనులు ప్రారంభిస్తున్నారు. ప్రస్తుతం నాట్ల పనులు జోరుగా సాగుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో పలుచోట్ల గురువారం కూలీలు నాట్లు వేస్తుండగా 'నమస్తే తెలంగాణ' క్లిక్‌మనిపించింది.

– నమస్తే తెలంగాణ స్టాఫ్ ఫొటోగ్రాఫర్ సిద్దిపేట, డిసెంబర్ 26



సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లిలో నాట్లు వేస్తున్న మహిళా రైతులు



పొలంలో తల్లికి సాయం చేస్తున్న కొడుకు



నాటు పనుల్లో మహిళా రైతులు